# అగ్ని పరివేశం

'చూడబ్బాయ్! పెద్దలు సంపాదించిన ఆస్తుపాస్తులేవీ లేవంటున్నావ్.... ఉద్యోగం కూడా లేదు. మరేం చూసి నీకు కన్యాదానం చెయ్యమంటావ్...' సూటిగా ప్రశ్నించిన రాజా రావు గారిలో హుందా తనం.... ఠీవి ప్రస్ఫుటమౌతున్నాయి' అనుకోని ప్రశ్న బాణంలా గుచ్చుకుంది సుకుమార్‌కు.

'నాకు....ఎమ్మేడిగ్రీ ఉందండీ....' వినయం తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో తటపటాయించాడు సుకుమార్.

'నాలిగ్గీచుకునేందుకా....?' కోపం లేనికొట్టు.

'ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలో రిజిష్టర్ చేయించానండీ....' ఓపిక అవసరమైంది.

'రిజిస్ట్రేషన్ చేసేప్పుడు ఎంప్లాయిమెంటాఫీసు గుమాస్తా చేతులు తడిపేందుకు....నీకు బహుమతిగా వచ్చిన పతకాన్నమ్మావ్ కదూ!' నిర్మొహమాటం, నిస్సంకోచం.

నీరుగారి పోయాడు సుకుమార్

నిరుద్యోగ పర్వం నిజస్వరూప మింత భయంకరంగా ఉంటుందా? తనను తానే ఆడిపోసుకున్నాడు

హైమవతీ తాను గాఢంగా ప్రేమించుకున్నామనీ,... ఆశీర్వదించి పెళ్ళి చేయమని - ఆమె తండ్రిని అడిచినప్పటి సంభా

షణ గుర్తుకొస్తే ఆతని గుండెల్లో గునపాలు దిగబడిపోతాయి. కాని...కడిగిన మల్లెపూవును తలదన్నే ముఖారవిందము. బంగారు తీగల్లా చుట్టుకుపోయే నాజూకైన చేతులు... అందానికి మెరుగులు దిద్దే అమాయకత్వం... హైమవతి కళ్ళ ముందు మెరవగానే గునపాలు కాస్తా పూల బాణాలై పోతాయి.

....అనాడు నిరుద్యోగిని. ఈనాడు ఉద్యోగంలో జాయినయిన ప్రయోజకుణ్ని.... అనుకున్నప్పుడు మాత్రం గర్వంగా ఫీలౌతాడు.... అడుక్కుతినేవాడు అమాత్యవర్యుడైనట్టు.

ట్రైనింకెళ్ళేముందు....హైమవతి విసిరిన అయస్కాంతపు చూపుల్ని.... చెదిరిపోకుండా ఎదలో భద్రపరుచుకున్నాడు.

ఇల్లొచ్చింది....దిగవయ్యా' ఒంటెద్దు బండి కనకయ్య ఈ లోకంలో పడేశాడు సుకుమార్ను.

బండి దిగ్గానే బంగారు బొమ్మ కోసం విసిరిన చూపులు ... తిరిగొచ్చేసాయి; పరావర్తనం చెందిన కిరణాల్లా. వచ్చేముందు హైమకు ఉత్తరం రాసినా ప్రయోజనం లేదనుకున్నాడు.

....తప్పకుండా వచ్చేస్తుంది.... చుట్టేస్తుంది.... చిలిపి ఊహల్తో స్నానాదులు ముగిసాయి 'భోజనం రెడీ!' అంది అమ్మ.

చెల్లి మనోహరి కొసరి కొసరి వడ్డిస్తూంటే–అమ్మచేతి వంట అమృతమనిపించింది.

నేను....ఉద్యోగంలో జాయినయానమ్మా! అన్నాడు అలవోకగా... అన్నంలో వచ్చడి కలుపుతూ.

అమ్మ పొంగిపోయింది....మనోహరి ఆనందసంద్రములో మునిగి తేలింది. వెంటనే

ట్రైనింకని వెళ్ళావు కదరా అన్నయ్యా.... అందిచారు వడ్డిస్తూ.

'నిజమే మనూ... ట్రైనింగ్‌లో ఉండగానే పోస్టింగిచ్చారు. రిలీవ్ కాగానే వెళ్ళి ఉద్యోగంలో జాయినయ్యాను.' అతని కళ్ళలోని వెలుగుల్ని చూచి మరింత మురిసిపోయింది తల్లి హృదయం.

ఏదో విధంగా.... హైమవతి గురించి ప్రస్తావించేందుకు దారులు వెతుకుతుంది మనసు.

'ఏవూళ్ళో నాయనా?' అడిగింది పెరుగు వడ్డిస్తున్న అమ్మ.

'కేశవపురంలో....'

'కేశవపురమా...?' కోరస్‌గా అన్నారు అమ్మా, మనోహరి వాళ్ళిద్దరి మొహాలలో-చోటుచేసుకుంటున్న నీలి నీడల్ని గమనిస్తూంటే వింతగా తోచింది.

'ఔను! నిన్న.... శనివారం జాయినయ్యాను. సాయంత్రం మనూరికి బయలుదేరాను ఈరోజు ఆదివారం....మళ్ళీ రేపు వెళ్ళాలి. అద్దెఇల్లూ అదీ చూచుకోవాలి....' అంటూ చేతులు కడుక్కున్నాడు.

తర్వాత....మనోహరినడిగాడు హైమవతి గురించి

మనోహరి మొహమ్మీద నీలి నీడలింకా తొలగలేదు. తటపటాయిస్తుంది.

'ఏమ్మా! చెప్పవా నీ స్నేహితురాలి గురించి?' అసహనం తొంగి చూచి దాక్కుంది

'నా స్నేహితురాలేనా....?' నవ్వాలని ప్రయత్నించింది.

సస్పెన్స్ భరించలేక పోతున్నాడు.

ఆ ప్రస్తావన అప్పుడే రాకుంటే బావుండనిపించింది మనో హరికి-కాని సుకుమార్ ఊరుకొనేట్టులేడు.

'హైమవతికి పెళ్ళై ఎనిమిది మాసాలైందన్నయ్యా!' వెంటనే అన్నయ్య మొహంలోకి చూసింది వాలకం గమనించాలని ... సాధ్యమైనంత తొందరగా వేరే విషయం ప్రస్తావించాలని. సుకుమార్ తల తిరిగి పోయింది

....తన స్వప్న సుందరి అందకుండా పోయిందా?

....తన ప్రేమ సౌధం పేక మేడలా కూలిందా??

అయ్యుండదు....తేరుకుని....

'చాల్లే మనోహరీ! తమాషాకి విషయమే దొరికిందా....?

మనోహరి కనుకొలుకుల్లో తిరిగిన నీటిని చూడగానే షాక్ కొట్టినట్టయింది.

'తమాషా కాదన్నయ్యా! నిజమే.... అదిప్పుడీ లోకంలో గూడాలేదు' అంది ఓణీతో కళ్ళద్దుకుంటూ.

సుకుమార్ మీద పిడుగుల వర్షం కురిసింది. తల బద్దలయేట్టుంది. తనను మోస్తున్న కుర్చీ పాతాళంలోకి దిగబడి పోతుంది. మనోహరి ప్రయత్నం ఫెయిలైంది.

'అదెలా....?' అనగలిగాడు.

'ఓ సంవత్సరం టైనింకని నువ్వెళ్ళగానే వాళ్ళ నాన్నగారొక గొప్పింటి సంబంధం చూసారు- ససేమిరా చేసుకోనంది హైమ వాళ్ళు చూపించిన బ్బాయిని చేసుకోకపోతే తల్లిదండ్రు లిద్దరొకేసారి విషం మింగి చస్తామని... దాగి వెండలు వచ్చేసారు.

కట్నకానుకలు బాగానే ముట్టజెప్పారట. నలుగురన్నదమ్ముల లో చిన్నవాడట అబ్బాయి. బాగా చదువుకున్నవాడట గూడా. వాల్గు నెలల తర్వాత ... హైమ తల్లి కాబోతుందని తెలిసి వాళ్ళ మ్మా నాన్నలు సీమంతానికి తీసికొద్దామని వెళ్ళారట గొంతు బొంగురు దోయింది

'ఏ వూరు?' వేదన నాపుకునే ప్రయత్నం

'కేశవ పురం....!'

'కేశవ పురమా .. సీమంతానికా?' ఆశ్చర్యం

'ఔను ...కాని వాళ్ళు వెళ్ళేసరికే జరగాల్సిన ఘోరం జరిగిపోయిందట....' అన్నయ్య కళ్ళలోకి చూచింది.

'అంటే!' ఆతృత, అయోమయం.

హైమ భర్తకు బ్లడ్ కాన్సరుందని ఆలస్యంగా తెలిసిందట లక్షల రూపాయలు ఖర్చుచేసి... ఎన్నోరకాల వైద్యం చేయించారట రాయవెల్లూరు హాస్పిటల్‌లో గూడా పరీక్షలు చేయించార్ట రోగం ముదిరిందని పెదవి విరచిన డాక్టర్లు. మందులు రాసిచ్చి చేతులు కడుకున్నారట. కొద్ది రోజులలోనే రక్తం కక్కికొన్ను మూసాడట ... 'హైమా! హైమా' గొంతు చినిగేట్టు అరిచాడు.

నిద్రాదేవి కౌగిట్లో ఒరిగిపోయిన టూటైరు బర్తును చుట్టుముట్టిన కొందరు తట్టిలేపారు .. తాను పలవరించినట్టు గుర్తొచ్చింది_సారీ చెప్పాడందరికీ....తప్పుచేసిన వాడిలా.

వీడెవడో తీవ్రవాదిలాగున్నాడనుకున్నవారి అంచనాలు పటాపంచలై పోనాయి. కిమ్మనకుండా వెళ్ళి.... తిరిగి నిద్రలోకి

జారుతూనే ప్రయత్నం చేస్తున్నారు.

దేశమంతా కరువు కాటకాలతో బాధపడుతూంటే తాను మాత్రం పూటపూటకూ విందు భోజనం వదులుకోలేని నాయకుడిలా రైలు మాత్రం శూన్యంలోకి దూసుకు పోతుంది- ఇవేవీ పట్టించు కోకుండా.

హైమ అంటే ఎవరండీ?'.... పల్లీవాల పదహారు పళ్ళు బయట పడ్డాయి.

'సినిమా హీరోయినా....?' చంకలెగిరేస్తున్న చాయ్‌వాలా మురిపెం.

'ఏదో పీడకలొచ్చుంటుంది.... పాపం! ఆయన ప్రాణాలు తోడేస్తారెందుకు?' అవలిస్తున్న పక్కబెర్తు పెద్ద మనిషి విసుకున్నాడు. సుకుమార్ నుండి సమాధానం రాలేదు.

కిటికీ తలుపులు తెరవగానే నిషాదేవి ఖుషి రాజ్యం కన్పించింది. రైలింజను లైటు వెలుగులలో.... చెట్లు కొరివిదయ్యాల్లా మెరిసి మాయమౌతున్నాయి. చల్లని గాలి ముఖం కడిగింది. టైం చూచుకున్నాడు సుకుమార్. రాత్రి పన్నెండైంది కిటికీ తలుపులు మూయగానే బర్తు పడుకోమంది.

మనోహరి చెప్పిన దృశ్యాలు కళ్ళముందు సినిమా రీళ్ళలాగా తిరుగుతున్నాయి.

....శోకదేవత హైమవతి తలబాదు కుంటుంది. సర్వస్వం దోచుకున్న దేవుణ్ని నిలదీస్తుంది. పున్నమ చంద్రుని కప్పేస్తున్న మబ్బుల్లాగా.... వెంట్రుకలు మోహం నిండా నాట్యం చేస్తున్నాయి. గుండెలు బాదుకుంటుంటే గాజులు ముక్కలై పోతు

8871
శ్రీకాకుళం

పోతున్నాయి. ఏడ్చిఏడ్చి కళ్ళల్లో నీరు ఇంకిపోయింది. గొంతు బొంగురు బోయింది.

అటిద్దరు, ఇటిద్దరు ఆడవాళ్ళామెను పట్టుకుని శవం వెంట నడిపిస్తున్నారు. బంధువులు, అభిమానులు గుంపులు గుంపులుగా వెంబడిస్తున్నారు.

రకరకాల కామెంట్సు వినబడుతున్నాయి.

హైమవతికి లోకమంతా శూన్యంగా కనబడుతుంది. మర బొమ్మలా నడుస్తుంది.

....తానిహ పసుపుకుంకాలకూ, పూలకూ, అలంకారాలకూ దూరం కావాలి...వెక్కిరింతలు భరించాలి.... తెల్లవారే తన ముహం చూచిన వారి తిట్ల వర్షం భరించాలి.... శుభకార్యాలేవీ తన చేతులమీదుగా జరగరాదు... అన్నింటినీ మించి-తండ్రిలేని పసికూనకు జన్మనివ్వాలి... జీవితమంతా రంపపుకోత భరించాలి.... అంతరంగం అల్లకల్లోలం.

శవయాత్ర శ్మశాన స్థలంచేరింది. ఓపక్క, శవదహనానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతున్నాయి. మరోపక్క ... ముత్తైదువలు హైమవత్తి తలమీద బిందెలనిండా నీరు కుమ్మరిస్తున్నారు. ఆ తర్వాత .... పట్టు పీతాంబరం హైమవతి ఒంటిని చుట్టేసింది. జడవేసి తలనిండా పుష్పాలు తురిమారు. తిలకధారణ జరిగింది. ఒళ్ళంతా పసుపు కుంకుమలతో నిండిపోయింది. ఒడి బియ్యం పోసి మంగళ హారతులిచ్చారు. పేర్చిన చితివద్దకు నడిపిస్తూ పాటలు పాడారు

ఆమె భర్త శవాన్ని చితిమీద పడుకోబెట్టారు. ప్రపంచాన్ని

మరిచి.... పిచ్చి చూపులు చూస్తున్న హైమవతి.... శవం పక్కలోకి చేర్చబడింది. పైన కట్టెలు పేర్చారు. కొన్ని కిరసనాయిల్ డబ్బాలు చితిమీద ఖాళీ ఐనాయి. దంపతులకు పుణ్యలోకం ప్రాప్తించాలనే పాటలు గొంతులు విప్పి పాడారు. పురోహితులు మంత్రోచ్చారణగా విస్తుంటే.... వచ్చిన వాళ్ళంతా అక్షింతలు చల్లి దూరంగా జరిగిపోయారు.

కాగడాతో చితి అంటుకుంది.

హైమవతి హాహాకారాలు చితిమంటలలో కలిసి ఆకాశాన్నందుకున్నాయి ప్రాణంలేని శవంతో పాటు ప్రాణమున్న శరీరం కాలిబూడిదైంది. పొగలు బంధుమిత్రులకు వీడ్కోలు చెప్పిపోయి వారికి లభించబోయే స్వర్గసుఖాల గురించి ముచ్చటించుకుంటూ ఇంటి మొహం పట్టారంతా.

... అలనాడు దక్షయజ్ఞంలో దూకిన అమ్మవారి లాగుంది ...

భార్యాభర్తలొకేసారి స్వర్గదారం చేరడం.... పూర్వజన్మ సుకృతమే....

ఆఁ... సుకృతమా ...గాడిద గుడ్డా...! కొందరి గుస గుసలు.... మరికొందరి రుసరుసలు.

* * *

వారానికొకసారి మాత్రమే వచ్చే ఆదివారం ఆలస్యంగా నిద్రలేపింది సుకుమార్‌ను. మొహం కడుక్కొని పేపరు తిరగేస్తుంటే.... మనసులగ్నం కాలేదు

శనివారమే శ్మశానం వైపు వెళ్ళాడు.

చిరునవ్వులతో... చిలిపి చేష్టలతో కనిపించింది హైమవతి

.. చేతులు చాచింది....

'....నువ్వు ట్రైనింకెళ్ళక పోతే ఉద్యోగం రాదు....ఉద్యో
గం లేకపోతే .. మానాన్న మన పెళ్ళి ఒప్పుకోడు.... వెళ్తే సం
వత్సరం దాకా తిరిగిరానంటున్నావు, ఎలా సుకుమార్....?' హై
మవతి కాటుక కళ్ళలో గిరుక్కుమన్న. కన్నీరు మనసంతా
కలిచి వేసింది

చేతులు చాచగానే....తీగలా చుట్టుకు పోయింది.

'....వచ్చేదాకా ఉత్తరాలు రాయకు సుకుమార్' బుంగ
మూతి పెట్టింది.

'....తపాలాశాఖ మీద కోపమా?' బుంగమూతి గిల్లగానే
కిలుక్కుమంది.

'... కాదు' ఇంద్రధనుస్సులా మెరిసింది.

'మనలాంటి ప్రేమపక్షులకపేకదా ఆశాదీపాలు' మరోబుగ్గ
గిల్లాడు. ముఖం మందారపువ్వైంది.

దివ్యానుభూతి తళుక్కుమంది. రెండు చేతులతో మెడను
చుట్టేసి గుండెలమీద ఒరిగిపోయింది.

నిజమేకాని....నీ పోకిరిచేష్టలతోనే భయం. అవే....
ఉత్తరాలలో రాస్తావు-మా నాన్న చూస్తే అగ్గిమీదగుగ్గిలమై పోతా
డు బలడరాముడై పోయి నన్నెవరికిన్నా ఇచ్చి కట్టబెడతాడు
నువ్వు దేవదాసువై పోతావు నేను మాంగల్యబలమంటూ గింజు
కోవాలి. ఇహ చివరకు మిగిలేది?....' గిలిగింతలు పెట్టింది.

హైమా....హైమా! ..

'ఏంనాయనా ..హైమా అంటూ అంత గట్టిగా పిలుస్తు

న్నావు....' ఇల్లుగలాయన కాఫీ గ్లాసులతో ప్రత్యక్ష మయ్యాడు. సిగ్గుపడ్డాడు సుకుమార్.

లేచి....సవినయంగా ఆహ్వానించి

'....అబ్బే... నేనాండీ....! అన్నాడు' చుట్టుకు పోయిన అనుభూతులలోంచి.

'రాత్రింతా అదే పేరు పలవరిస్తున్నావు. నీకూ మాకూ తడికే అడ్డం కాబట్టి స్పష్టంగా వినబడుతుంది. ఇంతకీ ఎవరా హైమ?' బుజ్జగింపుగా అడిగాడు – కాఫీగ్లాసులు టేబుల్ మీదుంచి తీసుకొమ్మని కళ్ళతో సైగచేస్తూ, పేపరు ముసలాయన చేతులలో కెళ్ళింది.

అద్దె పోర్షను తడికలదైనా ఇల్లుగల ముసలాయన హృదయం మాత్రం పెద్దబంగళా లాంటిదని నాలోజులలోనే తెలిసిపోయింది. ముసలి ప్రాణాలకు తోడుగా ఉంటాడని తడికకట్టి అద్దెకిచ్చాడు. ఆయన కొడుకులకు ఉద్యోగాల రెక్కలొచ్చి, కూతుళ్ళు పెళ్ళిళ్లై ఎగిరిపోయారట.

'....ముందు కాఫీ తాగునాయనా!' స్పందించని సుకుమార్‌కు కాఫీ గ్లాసందించాడు ఆప్యాయంగా.

'బాబాయ్‌గారూ....!' నెమ్మదిగా పలుకరించాడు.

'ఊం....' ఏమిటో చెప్పమన్నట్టు చూచాడు.

'ఈ వూళ్ళో సతీసహగమనం కేసులేమైనా.... ఐనాయా?' అడగలేక... అడగదల్చింది అడిగేసాడు.

'అంటే....?' ముసలాయన భృకుటి ముడిపడింది.

'చచ్చిన భర్త శవంతో...బ్రతికున్న భార్యను కాల్చేయడం'

సుకుమార్.... పలవరింపుకు కారణం చెప్పకుండా చాక చక్యంగా దాటవేస్తున్నందుకు నవ్వొచ్చింది.

'హైమవతి అనే అమ్మాయి.... భర్త శవాన్ని కాల్చేస్తుండగా చితిలో దూకిందని విన్నాను....' మొహంలో రంగులు మారి ఏదోగుర్తు కొచ్చి ఆగిపోయాడు.... రెడ్ సిగ్నల్ చూచిన రైల్లా.

దూకేప్పుడు వూరివారంతా చూస్తూ ఊరుకున్నారన్న మాట. ఒక నిండు ప్రాణాన్ని బలీదీసుకున్నారు వాళ్ళు....చెప్ప పెట్టకుండ తోసుకొచ్చింది ఉద్రేకం.

'ఆ అమ్మాయి గర్భవతని గూడా తెలుసు....'

'.... తెలిసి గూడా రాక్షసకృత్యాన్ని ఆపలేదా?'

'ఏం చేస్తారు బాబూ ఊరకుండక....' ముసలాయన గూడా స్పందించాడు_ఇహలాభం లేదని.

అంటే...

'వాళ్ళు జాగీర్దార్లు. పేరుమోసిన దొరల కుటుంబం. హైమవతి భర్త రాఘవేందర్ సద్గుణరాశి. పెద్దకట్నంతో పెళ్ళి ఘనంగా జరిగింది. పెళ్ళైన రెన్నెళ్ళ తర్వాత తెలిసింది.... రాఘవేందర్ కు బ్లడ్ కాన్సరని. గుండెలు పగిలేలా ఏడ్చిందా అమ్మాయి. ఐనా ...భార్యగా సేవలందించింది. ఎన్నో వ్రతాలు చేసింది గండం గడవాలని'

సుకుమార్ కనుకొలుకులలో వేదనాశ్రువులు చోటు చేసుకున్నాయి. కళ్ళు మూసుకుని వింటున్నాడు.

'రాఘవేందర్ తో కలిసి నలుగురన్నదమ్ములు. కోట్ల రూపాయల ఆస్తికి వారసులు ఆస్తి పంపకాల గురించి అంతకు ముందే

చాలాగొడవలైనాయని విన్నాంగాని.... పెద్దింటి పేచీలు గేటుదాటి బయటకు రాలేదు. రాఘవేందర్ శవంగా మారగానే మిగిలిన ముగ్గురన్నదమ్ములు కూడబలుక్కున్నారు-ఏదో విధంగా హైమవతినీ లోకంనుంచి పంపించాలని ... ఆస్తిని మూడు వాటాలుగా పంచుకోవాలని. నిజానికామెను చితిలోకి నెట్టి....ఆమెనే దూకేసిందని ప్రచారం చేయించారు. వాళ్ళనెదిరించే ధైర్యమెవరికుందీ ఊళ్ళో? ఆమెనూ.... గర్భస్థ శిశువునూ మింగేసిన పాపాత్ములు దశదిన కర్మ పెద్ద ఎత్తున జరిపించారు. దాన ధర్మాలు చేసారు. ఊరి వారంతా విందు భోజనాలారగించారా రోజు....' కంటి ధారల్ని తుండుగుడ్డతో తుడుచుకున్నాడు ముసలాయన.

'ఐతే...ఈ సంగతెవ్వరూ పోలీసులకు తెలియ జేయలేదా?' మాయమైన ఉద్రేకం ప్రశ్నించింది. అది మరింత పెరిగి ధైర్యంగా మారింది.

'చెప్పరేం బాబాయ్!' పిడికిళ్ళు చిన్నగా బిగుసుకుంటున్నాయి.

'రిపోర్టు ఇచ్చిన వాళ్ళనే పట్టుకు తంతారు పోలీసులు.' నిర్వేదం నిట్టూర్చింది,

'ఎందుకు?.'

'రిపోర్టు చేసిన వ్యక్తే ఫస్టు ఇన్ఫార్మెంటరవుతాడు. ఆవ్యక్తికే సర్వస్వం తెలుస్తుందనుకుంటారు పోలీసులు నేరానికి కారకులైన వారందరి పేర్లు చెప్పేదాకా వదలరు. నేరస్తుల పేర్లు చెప్పిన వాడికి రక్షణ ఉండదు. కాని గంటలలో శవమైపోతాడు. దొరలకు కోపమొస్తే.... ఇంకేమైనా కావచ్చు వాడి కుటుంబం.

ఎందుకొచ్చిన తంటాలని ఎవ్వరూ ముందుకు రాలేదు.' ఖాళీ గ్లాసులందుకున్నాడు.

కుర్చీలో... వెనక్కు వాలిపోయాడు సుకుమార్. తోసుకొచ్చే కన్నీటి నాపలేక పోయింది. ధైర్యం.

'కానీస్సెపాగి'

'ఏది ఏమన్నాగాని .. నేనే పోలిసులకు రిపోర్టిస్తా నిప్పుడు ....' అంటూ లేచాడు ఒక నిర్ణయంతో

హైమవతే హైమ అన్నసంగతి ఎప్పుడో తెలిసి పోయింది ముసలాయనకు.

'అన్నీ తెలిసే.... అగ్ని ప్రవేశం చేస్తావాబాబూ?' వారించబోయాడు.

సామాన్యుల భయమే రాక్షస కృత్యాలకు ప్రాణప్రదమౌతుంది. స్వార్థపరులు ఇష్టా రాజ్యం కొనసాగిస్తూ సాంఘిక ఆచారమని ముద్రవేస్తున్నారు.

'ఎన్నాళ్ళిలా నడుస్తుంది బాబాయ్?'

సుకుమార్ మొహం మంకెన పూవైంది.

క్షణాలలో తయారై బయల్దేరాడు.

అవతార మూర్తిలా కన్పించాడు ముసలాయనకు

("సాధన" కథల పోటీల్లో బహుమతి పొందిన కథ.
అక్టోబర్ 89)